క్లుప్తంగా

ఉచిత వైద్య పరీక్షలు



మరికల్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ఆదివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. వైద్యశిబిరం సర్పంచ్ గోవర్ధన్ ప్రారంభించారు. డాక్టర్లు రాకేష్, నయిమ్, రేష్మ పేదలకు వైద్యపరీక్షలు చేశారు. 65మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా వసంత



దామరగిద్ద: మండల ఎస్‌ఐగా ఏ. వసంత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్పీ కార్యాలయంలో వీఆర్ ఎస్‌ఐగా ఉన్న వసంత ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కారంకోసం కృషిచేస్తానన్నారు. అత్యవసర సమయంలో ప్రజలు తమను సంప్రదించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎస్‌ఐగా భాగ్యలక్ష్మిరెడ్డి

మక్తల్: మండల ఎస్‌ఐగా భాగ్యలక్ష్మిరెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ పర్వతాలు నారాయణపేట ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అనంతరం బాధ్యతలు చేట్టిన ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకోరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

నేడు అంగన్‌వాడీ భవనం ప్రారంభం

మక్తల్: మండలంలోని సంగంబండలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ చెన్న కేశవరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీచైర్‌పర్సన్ వన జమ్మ, సీడీపీఓ సరోజినీ మట్ట హాజరవుతారని, అందరు పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

సీఎం రేవంత్‌ను కలిసిన నాయకులు



మరికల్: మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం శాలువతో సన్మానించి వారు అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు కరీం తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్‌గా ఐదుగురు ఎంపిక

ఊట్కూరు: మండలానికి చెందిన ఐదుగురు ఆదివారం ప్రభుత్వం విడుదల చేసిన స్టాఫ్‌నర్స్‌ల ఉద్యోగాల్లో ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన పి. వెంకటేష్ కూతురు దివ్య, గొల్ల కృష్ణయ్య కూతురు భవిత, గరిణి అనంత్‌రెడ్డి కూతురు చంద్రకళ, కుర్వ అశోక్ భార్య కవిత, మొట్కూరు లక్ష్మారెడ్డి కుమారుడు కిరణ్‌కుమార్ ఎంపికయ్యారు. వీరు ఎంపిక కావడంపై ఎంపీపీ ఎల్కోటి లక్ష్మీ, సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

గ్రామస్తుల అభినందన

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామానికి చెందిన అక్కచెల్లెళ్లు స్టాఫ్ నర్సింగ్ ఉద్యోగం సాధించారు. గ్రామానికి చెందిన జయమ్మ కుతుర్లు అయిన నాగజ్యోతి, చంద్రకళ ఇద్దరు స్టాఫ్‌నర్సింగ్ ఉద్యోగంలో అర్హత సాధించారు. అలాగే వారి చిన్న కూతురు కూడా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో కుటింబికులను గ్రామస్తులు అభినందించారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

ధన్వాడ: బీఆర్‌ఎస్ పార్టీకి పట్టణ అధ్యక్షుడు పటేల్ నర్సింహులు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొంతకాలంగా పార్టీలో కష్టపడి పనిచేసిన పార్టీలోని పెద్దలు ఎవరు స్పందించకపోవడం చాలా బాధకరమని, బీఆర్‌ఎస్‌పార్టీని వీడి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

అస్తవ్యస్తంగా రైతువేదికలు

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్, పాంరెడ్డిపల్లే క్యాంపు కాలనీలో నిర్మించిన రైతువేదికలు అస్తవ్యస్తంగా మారాయి. రైతు ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర నిధులతో ఒక్కోదానికి రూ.20లక్షలు వెచ్చించి నిర్మించిన ఇవి ప్రస్తుతం మరుగునపడ్డాయి. వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని రైతులకు సాగుపై అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ అధికారులకు ఉపయోగపడే విధంగా నిర్మించారు. ప్రస్తుతం వీటిని వినియోగించుకోలేకపోవడంతో దుమ్ముధూళితో పాటు కిటికీలు, తలుపులు విరిగిపోతున్నాయి. అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

‘పల్లె’ వెలుగు జాడేది ?

- నేటికి బస్సు సాకర్యం లేని గ్రామాలు
- పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేట్ వాహనాలు
- పట్టించుకోని పాలకులు



పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేట్ వాహనాలు (ఫైల్)



గురువలింగంపల్లికి అందుబాటులో ఉన్న బీటీరోడ్డు (ఫైల్)

మాగనూర్: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు నేటికి బస్సుసాకర్యం కల్పించలేదు. మండలంలోని గురువలింగంపల్లి, తళంకేరి, వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి తదితర గ్రామాలకు అందమైన రహదారులు ఉన్నాయి. కానీ రవాణా సౌకర్యం మాత్రం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న వర్కూర్ గ్రామానికి నేటికి బస్సు సౌకర్యం లేదు. గతంలో పాలకుల ఒత్తిడి మేరకు కొన్నాళ్లు బస్సులను నడిపినా.. అధికారులు ఆదాయం రావడం లేదనే సాకుతో నిలిపివేశారు. దీంతో పల్లెప్రజలు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రం, ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి రావాడానికి చాలా ఆలస్యమవుతుంది. చివరికి ఆటోలు కూడా అందుబాటులో లేని దుస్థితి నెలకొంది.

వాహనాల్లో సామార్థ్యానికి మించి..

మండల కేంద్రంలోని వివిధ గ్రామాల పరిస్థితి ఇలాగే ఉంటే.. బస్సులేని గ్రామాల ప్రజలు, విద్యార్థులు పరిస్థితి చాలా వరకు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కాగా ఆటో వాలాలు ఇదే అదునుగా అనుకుని సామర్థ్యానికి మించి ఎక్కిస్తున్నారు. దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. సరైన సమయంలో కళాశాల, పాఠశాలలకు వెళ్లలేక ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్సుసౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

బస్సుసౌకర్యం కల్పించాలి



ప్రతీ పంచాయతీకి బస్సుసౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. నేటి సమాజంలో కూడా బస్సుసౌకర్యం లేని గ్రామాలు ఉండటం చాలా బాధకరం. పాలకులు చర్యలు తీసుకుని వెంటనే బస్సుసౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– అశోక్‌గౌడ్, గురువలింగంపల్లి గ్రామస్తుడు

అదనపు బస్సు ఏర్పాటుచేయాలి..



ప్రస్తుతం మాగనూర్, కొత్తపల్లి మీదుగా కృష్ణాకు వెళ్తున్న బస్సులో విద్యార్థులు సామర్థ్యానికి మించి ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సులో చోటు లేక చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రూట్‌లో మరో అదనపు బస్సును నడిపించాలి.

– అశోక్, కొత్తపల్లి గ్రామస్తుడు

సమస్య పరిష్కరిస్తాం..



మండలంలోని ఆయా గ్రామాలకు బస్సుసౌకర్యం లేదనే అంశం తమ దృష్టికి రాలేదు. అయితే ఆయా గ్రామాల సర్పంచ్‌లు లిఖీత పూర్వకంగా రాసి ఇస్తే మేము రూట్‌మ్యాప్ చూసి బస్సుసౌకర్యం కల్పిస్తాం.

– లక్ష్మీసుధా, డిపో మేనేజర్ నారాయణపేట

శిథిలావస్థలో కోట బుర్జు



పెద్దకడ్మూర్‌లో కూలేందుకు సిద్ధంగా ఉన్న కోట బుర్జు

నర్వ: కాకతీయుల కళాపిపాసకు నిదర్శనాలుగా నిలిచిన ఎన్నో కళాకండాలు మండలంలో నేడు మూగరోదన చేస్తున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంతోపాటు ఉందే కోడ్, పెద్దకడ్మూర్, పాథర్చేడ్ గ్రామాల్లో చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచినవి శిథిలావస్థలో నేడు దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో కాకతీయులు కట్టిన గ్రామ ముఖ ద్వారాలు, కోట బుర్జులు, గ్రామాలకు రక్షణగా నిలిచిన నలువైపుల కాపు కాచే రక్షణ గదులు, ఆలయాలు, శిల్ప సంపదలను చారిత్రక సాక్ష్యాలను భావితరాలకు అందించేందుకు గ్రామస్తులు, దాతలు కొంతమంది ముందుకొచ్చి వాటిని మరమ్మతు చేస్తున్నప్పటికీ పురావస్తు శాఖ అధికారులు వీటిని సందర్శించి వాటిని రాబోయే తరాలకు తెలిసేలా తీసుకోవాల్సిన దానిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ముగిసిన విభాగ్ స్థాయి క్రీడాపోటీలు



ఆటాపోటీలు ఆడుతున్న క్రీడాకారులు



బహుమతులు అందిస్తున్న శాంతకుమార్

నారాయణపేట రూరల్ : పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ స్కూల్‌లో పాలమూరు ఉమ్మడి జిల్లా (విభాగ్) స్థాయి ఆటాపోటీలు ఆదివారం ముగిశాయి. రెండు రోజులపాటు స్థానిక మినీస్టేడియంలో కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్, వాలీబాల్ పోటీలను నిర్వహించగా, పాఠశాల ఆవరణలో చెస్, క్యారం వంటి ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన 536మంది విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. 3 నుంచి 5తరగతులకు శిశువర్గ, 6నుంచి 8వ తరగతి వరకు బాలవర్గ, 9, 10వ తరగతి వారికి కిశోరవర్గాలుగా విభజించి బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా కబడ్డీ, వాలీబాల్ అసపోసియేషన్ అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు మానసిక, అధ్యాత్మిక, ప్రామాణిక వికాసం, శారీరక దృఢత్వం పొందాలన్నారు. క్రీడల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రతంగపాండురెడ్డి, బాలరాజు, డాక్టర్ మధన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్రాములు, ఎల్లప్ప, లక్ష్మయ్యగౌడ్, రఘురామయ్యగౌడ్, పీఈటీలు, హెచ్‌ఎం దత్తుచౌద్రి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1974–76 విద్యా సంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించిన పలువురు పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. తమ ఉన్నత చదువులు, ఉద్యోగ అన్వేషణ, పెళ్లిలు జరిగి ఒక్కో చోట స్థిర పడ్డారు. అయితే వీరంత ఆదివారం స్థానిక శీలా గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఒక్కొక్కరు వారి కుటుంబ సభ్యులతో హాజరై కళాశాల పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తీపి గుర్తులను ఒకరితో మరొకరు పంచుకుని ఆనందంగా గడిపారు. వివిధ రకాలైన ఆటాపోటీలు నిర్వహించుకుని, సమిష్టిగా భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, భీంచందర్‌గౌడ్, మల్లికార్జున్, భీమయ్య, కాశీనాథ్, విద్యులత, కుసుమ, యాదగిరి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయండి



మరికల్: మండలంలోని తీలేర్ నుంచి పుసల్ పహాడ్ వెళ్లే ప్రధాన రహదారి కంకర తేలి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై వాహనాలను తీసుకెళ్లాలంటేనే డ్రైవర్లు జంకుతున్నారు. రెండు గ్రామాల మధ్యన ఉన్న రహదారిని బీటీగా మార్చాలని ఇటీవల ఇరువురు గ్రామస్తులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు చేయాలని వారు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీపీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని సీనియర్ నాయకులు సాయిరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రమాకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగిరెడ్డి, ట్రెజరర్‌గా దండురాఘవలను ఎన్నుకున్నట్లు వివరించారు. టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. 317 జీవో బదిలీలుపై కార్యవర్గంలో చర్చించారు.

అడుగడుగునా లీకేజీలు

అమరచింత: మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పైపులైన్లు అడుగడుగునా లీకేజీలు అయ్యి తాగునీరు వృథాగా పారుతుంది. పట్టణంలోని ఊరేడమ్మ ఆలయ సమీపంలో ప్రధాన సీసీ రహదారిపై తక్కువ లోతులో ప్లాస్టిక్ పైపులైన్ వేయడంతో భారీ వాహనాలు వెళ్లిన ప్రతిసారి పైపులు పగిలిపోతున్నాయి. దీంతో డ్రెయినేజీలోని నీరు పైపులైన్ వెంట వెళుతుంది. తూక్యనాయక్ తండాకు వెళ్తున్న పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు నిల్వ ఉండి ఒక మడుగుల తయారైంది. లీకేజీల ద్వారా కలుషిత నీరు సరఫరా అయ్యి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యువకులకు క్రికెట్ కిట్‌పంపిణీ



యువకులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్‌లో గ్రామ ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్ ఆదివారం యువకులకు క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, శారీరక దృఢత్వం అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, అంజప్ప, శివశంకర్, గోవిందు, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

దోమలు బాబోయ్..

- ఫాగింగ్ చేయాలని గ్రామస్తుల వేడుకోలు



మాగనూర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మాగనూర్: మండల కేంద్రంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. పగలు, రాత్రి అని లేకుండా స్వైర్య విహారం చేస్తూ.. ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. మండలంలోని పలు కాలనీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతో వారం రోజులుగా పలు కాలనీలలో చెత్తసేకరణ నిలిచిపోయిందని వాపోతున్నారు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని, ఇప్పటికే చాలా మంది మలేరియా, టైఫాయిడ్ వైరల్ జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళ ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాడానికి జంక్కుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ ప్రత్యేక చొరవచూపి గ్రామంలో ఫాగింగ్ చేపట్టి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముదిరాజ్‌ల బీసీ ‘ఏ’ సాధనకు కృషిచేస్తాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, వంశీచందర్‌రెడ్డి తదితరులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ డీ గ్రూప్‌లో ఉన్న ముదిరాజ్‌లను ‘ఏ’ గ్రూప్‌లోకి మార్చాలని ఎన్నో ఏళ్లుగా చేస్తున్న డిమాండ్‌సాధనకు తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు యెన్నంశ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్‌రెడ్డితో కలిసి ముదిరాజ్ ఉద్యోగ సంఘం క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన కార్పొరేషన్ల పదవుల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వెయ్యి కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్పీ వెంకటేశ్, సంజీవ్‌ముదిరాజ్, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి విజయబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మరికల్: ఆర్థికంగా వెనకబడిన ముదిరాజ్‌లను బీసీ డి నుంచి ఏలో చేర్చాలని ఆ సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ, చంద్రశేఖర్, కొండయ్య, ఆంజనేయులు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలని పలుమార్లు విన్నివించిన తమ గోడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చి న్యాయం చేయాలని కోరారు.

ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లు

ఆత్మకూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయనే భయంతో ఆయా కాలనీవాసులు ఆందోళనకు చెందుతున్నారు. పట్టణంలోనే పరిస్థితి చక్కబెట్టని అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్, ఖానాపూర్, గుంటిపల్లి, తిప్పడంపల్లి, జూరాల, మోట్లంపల్లి, మేడేపల్లి, రేచింతల, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, మూలమళ్లలో ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన 54 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత లేకపోవడంతో మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మూలమళ్లలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

మహిళాశక్తి సమ్మేళనానికి తరలిన వనితలు



బస్సులో వెళ్తున్న మహిళలు

నారాయణపేట రూరల్: పాలమూరులో జరిగిన మహిళాశక్తి సమ్మేళనానికి నారాయణపేట నుంచి వనితలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఆదివారం స్థానిక సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసి బస్సులో విద్యా, వైద్య, క్రీడా, ధార్మిక, వ్యాపార, ఉద్యోగ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు స్త్రీలు హాజరై ప్రత్యేక పూజలు చేసి బయలుదేరారు. మహిళల చైతన్యంతోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ మహిళామోర్చ అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. సమ్మేళనానికి హాజరు కావడంతో స్త్రీ జాతి చైతన్యవంతమవుతుందన్నారు.

రుద్రభూమిలో ముళ్లపొదల తొలగింపు



ముళ్ల పొదలు తొలగిస్తున్న దృశ్యం

నారాయణపేట రూరల్ : పట్టణంలోని పొల్కమ్మ ఆలయం సమీపంలో ఉన్న రుద్రభూమిలో ఆదివారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. స్థానిక వీరశైవ లింగాయత్ – లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవుటి రవికుమార్ ఆధ్వర్యంలో జేసీబీ ఏర్పాటుచేసి ముళ్లపొదలను తొలగించారు. అంత్యక్రియల సమయంలో స్థలం సరిపోగా దగ్గర పూర్తిచేస్తుండటంతో మొత్తం శుభ్రం చేయించారు. కార్యక్రమంలో గందెర వికాంత్, అర్కంచి రవికుమార్, శశిధర్, మలికార్జున్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలి



నూతన కార్యవర్గంతో మల్లెపోగు శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో పెట్టకుండా కమిటీలు అంటూ కాలయాపన చేయడం బీజేపీ ప్రభుత్వానికి తగదని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కోటకదిరలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ నేరవేర్చకుండా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కాలయాపన చేస్తున్నాయని వాపోయారు. మాదిగలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయిలలో నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, జిల్లా అధ్యక్షుడు నరేష్, నాయకులు రమేష్, రాము, నర్సిములు, అశోక్, వెంకటేష్, మల్లేష్, మన్యంకొండ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ ఎస్‌ఐగా రాఘవేందర్

కోయిల్‌కొండ: ఎస్‌ఐగా కోయిల్‌కొండ పోలీస్‌స్టేషన్‌లో రాఘవేందర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన విజయ్‌భాస్కర్ మహబూబ్‌నగర్ వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో జడ్చర్ల నుంచి రాఘవేందర్ వచ్చారు.